## క్లుప్తంగా

### వాహనం ఢీకొని యువకుడికి గాయాలు

**గిద్దలూరు రూరల్:** టాటా ఏస్ వాహనం ఢీకొని యువకుడికి గాయాలైన సంఘటన మండలంలోని ముండ్లపాడు రోడ్డు మిట్టమీదిపల్లె గ్రామ సమీపంలో ఆదివారం జరిగింది. వేములపాడుకు చెందిన రామలింగారెడ్డి బైక్‌పై వెళ్తుండగా ఎదురుగా వస్తున్న టాటా ఏస్ వాహనం ఢీ కొట్టింది. ఈ ప్రమాదంలో రామలింగారెడ్డికి గాయాలయ్యాయి. క్షతగాత్రుడ్ని చికిత్స నిమిత్తం 108 సిబ్బంది గిద్దలూరు తరలించారు.

### 300 మందికి కంటి పరీక్షలు



కంటి పరీక్షలు నిర్వహిస్తున్న వైద్య సిబ్బంది

**కురిచేడు:** ఉన్నం చారిటబుల్ ట్రస్టు, శంకర నేత్రాలయం సంయుక్తంగా నిర్వహించిన వైద్య శిబిరంలో 300 మంది రోగులకు నేత్ర పరీక్షలు నిర్వహించారు. స్థానిక జిల్లా పరిషత్ బాలికోన్నత పాఠశాల ఆవరణలో నిర్వహించిన ఈ వైద్యశిబిరంలో 105 మంది రోగులకు కంటి శుక్లాలకు సంబంధించి శస్త్ర చికిత్సలు అవసరమని గుర్తించి వారిని తీసుకెళ్లి చికిత్సలు చేయనున్నట్లు నిర్వాహకులు తెలిపారు.

### వైద్య శిబిరానికి విశేష స్పందన



వైద్య పరీక్షలు నిర్వహిస్తున్న డాక్టర్ ఎన్. బ్రహ్మానందరెడ్డి

**రాచర్ల:** మండల కేంద్రమైన రాచర్లలోని విద్యాన్ స్కూల్‌లో గిద్దలూరు పట్టణానికి చెందిన డాక్టర్ బ్రహ్మానంద రెడ్డి హాస్పిటల్ ఆధ్వర్యంలో ఉచిత మెగా వైద్య శిబిరాన్ని ఆదివారం నిర్వహించారు. 750 మందికి మందులను ఉచితంగా పంపిణీ చేశారు. డాక్టర్ వై.సౌమ్యా రెడ్డి కంటి పరీక్షలు నిర్వహించారు. స్త్రీ వైద్య నిపుణులు డాక్టర్ గాయత్రి, గుండె వైద్య నిపుణులు బి. నారాయణరెడ్డి, కిడ్నీ వైద్య నిపుణులు డాక్టర్ రమణారెడ్డి, శస్త్ర చికిత్స వైద్య నిపుణులు సొంటం విష్ణుప్రసాద్ రెడ్డి, చిన్నిపిల్లల వైద్య నిపుణులు దూదేకుల దస్తగిరి, నరాల వైద్య నిపుణులు డాక్టర్.భరత్‌కుమార్ రెడ్డి, ఎమ్‌డీ డాక్టర్.శివకుమార్, విద్యాన్ విద్యా సంస్థల అధినేత పాండురంగారెడ్డి, మాజీ మండల కోఆప్షన్ సభ్యుడు షేక్.పల్నాటి మహబుబ్ పీరా, పఠాన్ జాఫ్రుల్లాఖాన్, పరదేశి రాజశేఖర్ తదితరులు పాల్గొన్నారు.


### పేదలకు 150 బస్తాల బియ్యం పంపిణీ



బియ్యం పంపిణీ చేస్తున్న ఎంఈఓ శ్రీనివాసరెడ్డి

**పొదిలి:** పేదలకు సాయం అందించడమే దైవ సేవ అని, అన్ని మతాలు ఇదే చెబుతాయని ఎంఈఓలు ఎం.శ్రీనివాసరెడ్డి, ఈవీ రంగయ్య పేర్కొన్నారు. ఆదివారం విశ్వనాథపురంలో హబీబుల్లా బేగ్ సేవా సంస్థ ఆధ్వర్యంలో పేదలకు 150 బస్తాల బియ్యం, కేజీ చొప్పున చింతతొక్కు పంపిణీ చేశారు. ముఖ్య అతిథులుగా పాల్గొన్న ఎంఈఓలు మాట్లాడుతూ.. సంపన్నులు చాలా మంది ఉంటారని, సాయం చేసే గుణం మాత్రం కొందరికే ఉంటుందన్నారు. రంజాన్ మాసంలో ముస్లింలు పేదలకు సాయం చేయడం అభినందనీయమన్నారు. సంస్థ చైర్మన్ కరీముల్లా బేగ్‌ను అభినందించారు. ముందుగా నూర్ మజీద్ ఇమామ్ రబ్బానీ మౌలానా ఆధ్వర్యంలో ప్రత్యేక ప్రార్థన చేశారు. కార్యక్రమంలో జేవీవీ జిల్లా ఉపాధ్యక్షుడు దాసరి గురుస్వామి, యూటీఎఫ్ జిల్లా కార్యదర్శి అబ్దుల్‌హై, బార్ అసోసియేషన్ కార్యదర్శి షబ్బీర్, విశ్రాంత ఉద్యోగులు మూసా జాని, నాసర్ అహ్మద్, ఇన్ఫోటెక్ కంప్యూటర్ నిర్వాహకులు జిలానీ, సీఆర్పీ శ్రీనివాసకుమార్, ఉపాధ్యాయుడు జిలానీ తదితరులు పాల్గొన్నారు.

### వేడుకగా సీతారామ కల్యాణం



ప్రత్యేక అలంకరణలో సీతారాములు

**కొనకనమిట్ల:** కొనకనమిట్ల, చినమనగుండం గ్రామాల్లోని పట్టాభిరామ స్వామి ఆలయాల్లో సీతారాముల కల్యాణాన్ని ఆదివారం ఘనంగా నిర్వహించారు. కల్యాణ ఉభయ దాతలుగా పలువురు దంపతులు వ్యవహరించారు. ముందుగా వేదపండితులు శేఖరశర్మ సీతారాములకు అర్చనలు, అభిషేకాలు నిర్వహించి కల్యాణం నిర్వహించారు. అనంతరం భక్తులకు పానకం, వడపప్పు పంచిపెట్టారు. కల్యాణం సందర్భంగా అన్నదాన కార్యక్రమం, సీతారాముల పట్టాభిషేక ఉత్సవం నిర్వహించారు.

# సామాజిక జీవనాన్ని ఆచరించండి

- కంచి పీఠాధిపతి శంకర విజయేంద్ర సరస్వతి మహాస్వామి



గోవుకు ఆహారం తినిపిస్తున్న కంచి పీఠాధిపతి

**ఒంగోలు టౌన్:** ధర్మం ప్రకారం సామాజిక జీవనాన్ని ఆచరించాలని కంచి పీఠాధిపతి శంకర విజయేంద్ర సరస్వతి మహాస్వామి బోధించారు. ఒంగోలు కేశవస్వామిపేటలోని శివాలయం వద్ద ఉన్న తాతా లక్ష్మీప్రసాద్ కల్యాణ మండపంలో ఆదివారం రాత్రి నిర్వహించిన సభలో ఆయన ప్రసంగించారు. భావితరాలకు ధర్మం, పురాణాల విశిష్టత, పండుగలు, సాహిత్యం గురించి తెలియజేయాలని చెప్పారు. గతంలో త్యాగం, ఓర్పు, పెద్దలను గౌరవించడం, కట్టుబాటు లాంటి గొప్ప సంస్కృతి ఉండేదని గుర్తుచేశారు. ఇప్పుడు అవి మృగ్యమయ్యాయని ఆవేదన వ్యక్తం చేశారు. పరనిందలు వదిలేసి మనసును ఆహ్లాదపరిచేలా మాట్లాడాలని సూచించారు. ఆహారంలో ఆరోగ్యాన్ని నేర్పించిన ధర్మం సనాతన హిందూ ధర్మం ఒక్కటే అన్నారు. ధర్మం గురించి సంపూర్ణంగా తెలుసుకుంటే మన గొప్పతనం తెలుస్తుందని చెప్పారు. పంచాంగం ప్రకారం మంచి కార్యక్రమాలు చేయాలన్నారు. కలియుగంలో ధర్మం కంటే బాహ్య ప్రపంచంలోని విషయాలపైనే ఎక్కువగా ఆసక్తి ఉందని, సత్వర ఫలితాల కోసం పనికిరాని విషయాల వెంట పడి పరుగులు తీస్తున్నారని అన్నారు. ధర్మ సంస్థాపన కోసం భగవంతుడు ఏదో ఒక రూపంలో భూలోకానికి వస్తుంటాడని చెప్పారు. కంచితో ఒంగోలుకు సాన్నిహిత్యం ఉందని, ఇక్కడికి అనేకమార్లు రావడం జరిగిందని గుర్తుచేసుకున్నారు. ముందుగా నగరంలోని ముంగమూరు రోడ్డులో మర్రిచెట్టు వద్ద ఉన్న శ్రీమహాలక్ష్మి నిలయం నుంచి ముంగమూరు రోడ్డు, కోర్టు సెంటర్, గాంధీ రోడ్డు మీదుగా శివాలయం వద్ద ఉన్న కల్యాణ మండపానికి స్వామివారి శోభాయాత్ర జరిగింది. ఈ యాత్రలో నగరంలోని భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. శ్రీ ప్రసన్నాంజనేయస్వామి దేవస్థానంలో స్వామివారిని కంచి పీఠాధిపతి దర్శించుకున్నారు.



కార్యక్రమంలో మాట్లాడుతున్న కంచి పీఠాధిపతి

## వచ్చే ఎన్నికల్లోనూ

# వైఎస్సార్ సీపీదే విజయం

- ఎవరు ఎవరితో పొత్తులు పెట్టుకున్నా ఇది తథ్యం
- మద్దిపాడు ఎంపీపీ వాకా అరుణ



గాజులపాలెంలో మా నమ్మకం నువ్వే జగనన్న కార్యక్రమంలో పాల్గొన్న ఎంపీపీ వాకా అరుణ, మండవ అప్పారావు, నాయకులు

**మద్దిపాడు:** రాష్ట్రంలో ఎవరు ఎవరితో పొత్తులు పెట్టుకున్నా వచ్చే ఎన్నికల్లో విజయం వైఎస్సార్ సీపీదే అని మద్దిపాడు ఎంపీపీ వాకా అరుణ కోటిరెడ్డి అన్నారు. మండలంలోని గాజులపాలెం గ్రామంలో ఆదివారం నిర్వహించిన మా నమ్మకం నువ్వే జగనన్న కార్యక్రమంలో ఆమె పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి కుల, మత, ప్రాంతీయ భేదాలు లేకుండా అర్హులైన ప్రతి ఒక్క లబ్ధిదారునికి పథకాలు అందిస్తున్నారని వివరించారు. ఆయనకు మనమంతా అండగా నిలవాలని కోరారు. ప్రజల కోసం కష్టపడేవారిని ముఖ్యమంత్రిని చేసుకుంటే మేలు జరుగుతుందన్నారు. వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ మండవ అప్పారావు మాట్లాడుతూ ఒంటరిగా పోరాడలేక, జగన్‌ను ఎదుర్కొనే దమ్ము లేక ఇతర పార్టీలతో పొత్తుకు టీడీపీ ప్రయత్నిస్తోందన్నారు. చంద్రబాబు తన జీవితంలో పొత్తు లేకుండా ఎప్పుడైనా ఎన్నికలకు వెళ్లాడా అంటూ ప్రశ్నించారు. గ్రామంలోని లబ్ధిదారులతో మాట్లాడటానికి వెళ్లగా, వారు ఆత్మీయంగా స్వాగతం పలుకుతూ తమ కష్టాలను తీర్చిన జగనన్నకే ఓటు వేస్తామని తెలిపారు. అనంతరం వారి ఫోన్ నుంచి నంబర్‌కు మిస్డ్‌కాల్ ఇచ్చి ఇంటికి స్టిక్కర్లు అంటించారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ గ్రామ నాయకుడు తిప్పారెడ్డి కోటిరెడ్డి, వైస్ ఎంపీపీ పైడిపాటి వెంకట్రావు, నాయకులు సన్నపురెడ్డి రమణమ్మ, రావూరి ప్రసన్నాంజనేయరెడ్డి, దేవరాజు, స్థానిక నాయకులు కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.

**మడనూరులో...**

**మడనూరు (కొత్తపట్నం):** మండలంలోని మడనూరు గ్రామంలో సర్పంచ్ గంగవరపు కోటేశ్వరరావు ఆధ్వర్యంలో ఆదివారం జగనన్నే మా భవిష్యత్తు, మా నమ్మకం నువ్వే జగనన్న కార్యక్రమం నిర్వహించారు. ముందుగా స్వర్ణాంధ్రపట్టపుపాలెంలో గృహాలకు వెళ్లి సంక్షేమ పథకాల గురించి వివరించారు. టీడీపీ ప్రభుత్వంలో పథకాలను ఎలా అమలుచేశారు.? వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో ఎలా అమలుచేశారనే విషయాన్ని వివరించారు. ప్రజల అనుమతితో వారి ఇళ్లకు స్టిక్కర్లు అంటించారు. టోల్ ఫ్రీ నంబర్‌కు ఫోన్ చేశారు. కార్యక్రమంలో సామంతుల వీరారెడ్డి, వాయల రోశయ్య, పి.కొండయ్య, వాయల శ్రీను తదితరులు పాల్గొన్నారు.



మడనూరులో పాల్గొన్న నాయకులు

## 452 మందికి ఉచిత వైద్య పరీక్షలు

**మడనూరు (కొత్తపట్నం):** మడనూరు గ్రామంలో ఆదివారం నిర్వహించిన ఉచిత వైద్య శిబిరంలో 452 మందికి వైద్య పరీక్షలు నిర్వహించారు. ఒంగోలులోని శ్రీరామ్ మల్టీ సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్ డాక్టర్ చాపల వంశీకృష్ణ ఆధ్వర్యంలో ఒంగోలు శ్రీనిధి ఫిషరీస్, పాలిటెక్నిక్ ఒకేషనల్ కాలేజీ, గ్రామ పెద్దలు, కాపులు, నాయకుల సహకారంతో ఉదయం 10 నుంచి సాయంత్రం 3 గంటల వరకు వైద్య శిబిరం నిర్వహించారు. ఎముకలు, కీళ్లు, నరములు, స్త్రీల సమస్యలు, గర్భిణుల సమస్యలు, జనరల్ మెడిసిన్, జనరల్ సర్జరీ, దగ్గు, నెమ్ము, ఆయాసం, ఛాతి, ఊపిరితిత్తులు, దంత సమస్యలు, బీపీ, షుగర్, థైరాయిడ్, వంటి దీర్ఘకాలిక వ్యాధులు, కొలెస్ట్రాల్, గుండె, కిడ్నీ, లివర్, మెదడు, పక్షవాతం, ఫిట్స్, కడుపు నొప్పి, గ్యాస్ ట్రబుల్, అల్సర్, అపెండిక్స్, వరిభీజం, హెర్నియా, ఫిస్టులా, వేరికోజ్ వెయిన్స్, కిడ్నీలో రాళ్లు, లివర్‌లో రాళ్లు, ఫిజియోథెరిపీ సమస్యలకు వైద్య సేవలు అందించారు. డాక్టర్ చాపల శాంతకుమారి, జనరల్, ఫ్యామిలీ ఫిజీషియన్, షుగర్, బీపీ, థైరాయిడ్, కొలెస్ట్రాల్, గుండె, కిడ్నీ, లివర్ వైద్య నిపుణుడు సున్నపు విజయ్‌కుమార్, డాక్టర్ నాగిడి కుమార్, డాక్టర్ నందలూరు సరయు, డాక్టర్ పొక్కింగారి ఏడుకొండలు, వెంకటేష్, శ్రీను పాల్గొని వైద్య పరీక్షలు చేశారు.



వైద్య పరీక్షలు చేస్తున్న డాక్టర్ ధీరజ్‌బాబు

### పేదలకు వైద్యం అందించడమే లక్ష్యం

**జే.పంగులూరు:** పేదలకు అవసరమైన వైద్యాన్ని అందుబాటులోకి తీసుకురావటమే గంగవరం ప్రాంత ఆరోగ్య సంక్షేమ వేదిక లక్ష్యమని, ప్రముఖ వైద్యుడు డాక్టర్ మంచాల రమేష్‌బాబు అన్నారు. ఆదివారం పంగులూరు గంగవరం ప్రాంత ఆరోగ్య సంక్షేమ వేదిక సభ్యుల సమావేశం జరిగింది. ఈ సమావేశానికి ప్రజాసంఘాల నాయకుడు రాయిని వినోద్‌బాబు అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ రమేష్‌బాబు మాట్లాడుతూ ప్రస్తుతం వైద్యం చాలా ఖరీదుగా మారిపోయిందని, వైద్యమంతా కార్పొరేట్ శక్తుల చేతుల్లోకి వెళ్లిపోయిందన్నారు. శ్రమజీవుల ఆరోగ్యం కాపాడేందుకే గంగవరం ప్రాంత ఆరోగ్య సంక్షేమ వేదిక వైద్య సేవలు అందిస్తుందన్నారు. హైద్రాబాద్ సుందరయ్య విజ్ఞాన కేంద్రం మాజీ కార్యదర్శి వై సిద్ధయ్య మాట్లాడుతూ దాతల సహకారంతో నడుస్తున్న ఈ ఆరోగ్యం సంక్షేమ హెల్త్ మరింత ముదుకు పోవాలని తెలిపారు.

## మే 14న ఉపధ్వజం ప్రతిష్ఠ

**ఒంగోలు టౌన్:** నగరంలోని కేశవస్వామిపేటలో గల శ్రీకాశీవిశ్వేశ్వరస్వామి దేవస్థానంలో ప్రస్తుతం ఉన్న ధ్వజం భిన్నమైనందున దానిని తొలగించి ఉపధ్వజం ఏర్పాటు చేశారు. మే 14న నూతన జీవధ్వజ ప్రతిష్ఠకు ముహూర్తం నిర్ణయించినట్లు ఈవో డి.రజనీకుమారి తెలిపారు. ఆదివారం దేవస్థానంలో శ్రీ మహాగణపతి పూజ, ప్రధాన మండపారాధన, ధ్వజస్తంభానికి అభిషేకం, హోమం, బలి ప్రదానం తదుపరి పూజా కార్యక్రమాలు నిర్వహించి ఉపధ్వజం ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో దేవదాయ ధర్మాదాయశాఖ పరిశీలకుడు సీహెచ్ వేణుగోపాలరావు, గ్రామ రెవెన్యూ అధికారి శ్రీనివాసరావు, ధర్మకర్తల మండలి చైర్మన్ ఈదుపల్లి గురునాథరావు, సభ్యులు కుర్రా ప్రసాద్‌బాబు, పుచ్చకాయల గోవర్ధన్‌రెడ్డి, ఈమని మదన్‌మోహన్, కరేటి కిరణ్‌బాబు, దార్ల వెంకట రమణమ్మ, నెమ్మాని మరిప్రియదేవి తదితరులు పాల్గొన్నారు.



ఉపధ్వజాన్ని ఏర్పాటు చేస్తున్న దృశ్యం

### మహిళ అదృశ్యంపై కేసు

**చినగంజాం:** వివాహిత మహిళ అదృశ్యంపై చినగంజాం పోలీస్ స్టేషన్‌లో ఆదివారం కేసు నమోదయింది. ఎస్సై కట్టా అనూక్ వివరాల మేరకు.. మండలంలోని పూలవారిపాలెం గ్రామానికి చెందిన రాచూరి తిరుపతమ్మ ఆరోగ్య సమస్యపై వైద్య చికిత్స నిమిత్తం ఈనెల 3వ తేదీ హైద్రాబాద్ వెళ్లింది. ఆమె భర్త రాచూరి రాము ఆమె ఆచూకీ కోసం బంధువులను, పరిచయస్తులను విచారించి ఫలితం లేకపోవడంతో ఆదివారం స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. భర్త ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

## సేవా కార్యక్రమాల్లో వాసవీ క్లబ్ ముందంజ



మాట్లాడుతున్న క్లబ్ సభ్యురాలు అన్నపూర్ణ

**అద్దంకి రూరల్:** సేవా కార్యక్రమాల నిర్వహణలో వాసవీ క్లబ్ ఇంటర్నేషనల్ ముందంజలో ఉంటుందని క్లబ్ కేబినెట్ సెక్రటరీ వూటుకూరి ఉమఅన్నపూర్ణ అన్నారు. ఆదివారం స్థానిక చుండూరి రామసుశీల నిలయంలో వీ205వ జిల్లా ద్వితీయ మైక్రో కేబినెట్ మీటింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మే 6,7 తేదీల్లో శ్రీశైలంలో లీడర్‌షిప్ క్యాలిటీని పెంచే శిక్షణ కార్యక్రమం నిర్వహించనుననట్లు తెలిపారు. జిల్లాలోని క్లబ్బులు చలివేంద్రాలను ఏర్పాటు, కుట్టు మిషన్ల పంపిణీ కార్యక్రమం నిర్వహించనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో శిద్దా సూర్య ప్రకాష్‌రావు, అమరా సుబ్బారావు, కునాల సుదర్శన్, బాల వెంకట సత్యనారాయణ, వైస్ గవర్నర్ చేబ్రోలు సురేష్‌బాబు, గ్రంధి లక్ష్మి నాగరాజ కుమార్, ట్రజరర్ వైశాలి వెంకట అనంత సుజాత, అద్దంకి వాసవి, వాసవీ వనిత క్లబ్ అధ్యక్షులు ఆత్మకూరి ఆంజనేయులు, ఆత్మకూరి శిరీషా, వాసవి క్లబ్ ట్రెజరర్, గొల్ల పాపారావు తదితరులు పాల్గొన్నారు.

# సేవలను విస్తృతం చేయాలి




ఎమ్మెల్యే బాలినేని శ్రీనివాసరెడ్డిని సన్మానిస్తున్న ప్రకాష్, తదితరులు

- ఒంగోలు ఎమ్మెల్యే బాలినేని శ్రీనివాసరెడ్డి

**ఒంగోలు:** మాంటిస్సోరి విద్యా సంస్థల సేవలను విస్తృతం చేయాలని, వారు ప్రారంభించే నూతన కార్యక్రమాలకు తన సంపూర్ణ సహకారం అందిస్తానని వైఎస్సార్ సీపీ రీజినల్ కో ఆర్డినేటర్, ఒంగోలు ఎమ్మెల్యే బాలినేని శ్రీనివాసరెడ్డి అన్నారు. స్థానిక పీవీఆర్ బాలుర ఉన్నత పాఠశాల ఆవరణలో ఆదివారం రాత్రి నిర్వహించిన మాంటిస్సోరి 32వ వార్షికోత్సవానికి బాలినేని ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మాంటిస్సోరి ప్రకాష్‌బాబుతో తనకున్న అనుబంధాన్ని వివరించారు. ఉన్నతమైన లక్ష్యంతో విద్యాసంస్థను నెలకొల్పడం, రెడ్‌క్రాస్ చైర్మన్‌గా ప్రజలకు విస్తృత సేవలు అందించడంతో పాటు తన విజయంలోనూ ప్రకాష్‌బాబు పాత్ర ఉందన్నారు. డైరెక్టర్‌గా పూర్తి బాధ్యతలు చేపడుతున్న ప్రకాష్‌బాబు కుమారునికి కూడా తన సంపూర్ణ సహకారం ఉంటుందన్నారు. కరోనా సమయంలో ప్రకాష్‌బాబు అందించిన సేవలు ఆదర్శనీయమన్నారు. పేద ప్రజల కష్టాలు చూడలేక కోటి రూపాయల వ్యయంతో తన తండ్రి పేరు మీద జర్మన్ షెడ్ ఏర్పాటు చేసి కోవిడ్ బాధితులను ఆదుకున్నామని బాలినేని గుర్తుచేశారు. కష్టాల్లో ఉన్న పేదలను ఆదుకునేందుకు ముందుకొచ్చే ప్రతి ఒక్కరికీ ఈ సందర్భంగా ధన్యవాదాలు తెలిపారు. తూర్పు రాయలసీమ ఉపాధ్యాయ ఎమ్మెల్సీ పర్వతరెడ్డి చంద్రశేఖరరెడ్డి మాట్లాడుతూ భిన్నమైన వ్యక్తిత్వం కలిగిన మాంటిస్సోరి డైరెక్టర్ శబరీనాథ్ అతి త్వరలోనే ఉన్నత స్థానానికి చేరుకోవాలని ఆకాంక్షించారు. పిల్లలను సున్నితంగా పెంచడం కాదని, ఏ సమస్య వచ్చినా తట్టుకుని నిలబడే మనస్తత్వాన్ని పిల్లల్లో నెలకొనేలా చూడాలని తల్లిదండ్రులకు విజ్ఞప్తి చేశారు. మాంటిస్సోరి ప్రకాష్‌బాబు మాట్లాడుతూ 1991లో కేవలం 56 మంది పిల్లలతో తాను విద్యాసంస్థను ప్రారంభించానని, నేడు ఆ సంఖ్య 1600కు చేరడం తనకు లభించిన అదృష్టంగా భావిస్తున్నానని అన్నారు. ఈ సందర్భంగా బాలినేని, పర్వతరెడ్డిలను ప్రకాష్‌బాబు, శబరీనాథ్‌లు ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో నగర మేయర్ గంగాడ సుజాత, వైఎస్సార్ ఆరోగ్యశ్రీ ప్రత్యేక అధికారి డాక్టర్ యాదాల అశోక్‌బాబు, ప్రొఫెసర్ పీహెచ్‌జీ కృష్ణంరాజు, ఏఎంసీ చైర్మన్ కొఠారి రామచంద్రరావు, లయన్స్ క్లబ్ ఆఫ్ ఒంగోలు సిటిజన్స్ రామకృష్ణ, సరస్వతి విద్యాసంస్థల అధినేత రమణారెడ్డి, కటారి శంకర్, వైఎస్సార్ టీచర్స్ ఫెడరేషన్ జిల్లా గౌరవాధ్యక్షుడు జి.వెంకటేశ్వరరెడ్డి తదితరులు పాల్గొన్నారు. అనంతరం చిన్నారుల సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి.

## పీర్లమాన్యంలో ముస్లింలకు ఇఫ్తార్ విందు



కార్యక్రమంలో పాల్గొన్న గోలి తిరుపతిరావు, దుంపా చెంచిరెడ్డి, నాయకులు

**చీమకుర్తి:** పవిత్ర రంజాన్ మాసం సందర్భంగా ఒంగోలు 39వ డివిజన్‌లోని పీర్లమాన్యంలో స్థానిక కార్పొరేటర్ గోలి లక్ష్మీకోటేశ్వరమ్మ, వైఎస్సార్ సీపీ బీసీ సెల్ జిల్లా అధ్యక్షుడు గోలి తిరుపతిరావు ఆధ్వర్యంలో ముస్లింలకు ఆదివారం ఇఫ్తార్ విందు ఏర్పాటు చేశారు. ముస్లింలందరినీ అల్లా చల్లగా చూడాలని ఆకాంక్షించారు. ముందుగా స్థానిక మసీదులో ముస్లింలతో కలిసి ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించగా, వైఎస్సార్ సీపీ సంతనూతలపాడు మండల కన్వీనర్ దుంపా చెంచిరెడ్డి పాల్గొన్నారు. ఈ నెల 19న ఒంగోలు సెయింట్ థెరిస్సా స్కూల్‌లో వైఎస్సార్ సీపీ రీజినల్ కో ఆర్డినేటర్, ఒంగోలు ఎమ్మెల్యే బాలినేని శ్రీనివాసరెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించే ఇఫ్తార్ విందుకు ముస్లింలు అధిక సంఖ్యలో హాజరుకావాలని గోలి తిరుపతిరావు కోరారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నాయకులు ఓబుల్‌రెడ్డి, కాలేషా, బషీర్, సైదులు, రసూల్, స్థానికులు పాల్గొన్నారు.

## పేద విద్యార్థిని చదువుకు ఆర్థికసాయం

**ఒంగోలు అర్బన్:** బీ ఫార్మసీ రెండో సంవత్సరం చదువుతున్న పేద విద్యార్థిని లలితాభవానికి సూర్యశ్రీ దివ్యాంగుల చారిటబుల్ ట్రస్టు ఆదివారం ఆర్థిక సహాయం అందజేసింది. రేపల్లెకు చెందిన కొమరభక్తిని లలితాభవాని పేదరికంతో ఫీజులు కట్టలేని పరిస్థితిని తెలుసుకున్న ట్రస్టు సభ్యులు నగరంలోని ట్రస్టు కార్యాలయంలో రూ.20 వేలు ఆర్థికసాయం అందజేశారు. కార్యక్రమంలో ట్రస్టు సెక్రటరీ షేక్ సర్దార్‌బాషా, నగర అభివృద్ధి కమిటీ అధ్యక్షుడు మారెళ్ల సుబ్బారావు, మోటుపల్లి వెంకటేశ్వర్లు, విజయ తదితరులు పాల్గొన్నారు.



ఆర్థికసాయం అందజేస్తున్న సూర్యశ్రీ ట్రస్టు సభ్యులు

## విద్యుత్ పరికరాల వినియోగంలో జాగ్రత్తలు అవసరం

**ఒంగోలు టౌన్:** విద్యుత్ పరికరాలను వినియోగించే విషయంలో తగిన మెళకువలు, జాగ్రత్తలు పాటించాలని జిల్లా ఫైర్ ఆఫీసర్ ఎస్.వేణుగోపాలరావు సూచించారు. స్థానిక కొణిజేటి గుప్తాస్ ప్యారడైజ్ అపార్ట్‌మెంట్ ఆవరణలో ఆదివారం అగ్నిమాపక వారోత్సవాలు నిర్వహించారు. వంట గ్యాస్ సిలిండర్ లీకైనప్పుడు, అగ్ని ప్రమాదాలు సంభవించినప్పుడు తీసుకోవాల్సిన జాగ్రతల గురించి అపార్ట్‌మెంట్ వాసులకు అవగాహన కల్పించారు. కరపత్రాలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో అపార్ట్‌మెంట్ ప్రెసిడెంట్ కొణిజేటి సుబ్బయ్య, ఏడీఎఫ్‌వో వి.శ్రీనివాసులరెడ్డి తదితరులు పాల్గొన్నారు.



జాగ్రత్తలపై కరపత్రాలు అందజేస్తున్న అగ్నిమాపక సిబ్బంది